ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 14 మార్చి 2024 | 5



పసిబాలుడిని గోనె సంచిలో కట్టి వదిలేశారు..
» కాకినాడ ఒకటో డివిజన్ బోట్‌క్లబ్ పార్కువద్ద వదిలిన గుర్తు తెలియని వ్యక్తులు
» గమనించి జీజీహెచ్‌కు తరలించిన స్థానికులు

సీటెవరికో?



» నేడు టీడీపీ, జనసేన రెండో విడత అసెంబ్లీ అభ్యర్థుల జాబితా
» సీట్లు పెండింగ్‌లో ఉన్న చోట్ల ఇన్‌ఛార్జులు, ఆశావహుల్లో టెన్షన్
» సీటు ఉంటుందో.. చేజారుతుందో అర్థంకాక అయోమయం
» కాకినాడ సిటీ, పిఠాపురం, ప్రత్తిపాడు సీట్లపై కొనసాగుతున్న సస్పెన్స్
» మూడు సీట్లకు అభ్యర్థులను ప్రకటిస్తారా.. లేదా? అనేదానిపై చర్చ
» పిఠాపురం సీటుపైనే అందరి దృష్టి: పవన్ పోటీపై ఉత్కంఠ
» అటు కాకినాడ ఎంపీ అభ్యర్థి ఎవరనేదానిపైనా గందరగోళం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముహూర్తం దగ్గరపడడంతో టీడీపీ, జనసేన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు స్పీడు పెంచాయి. ఇందులో భాగంగా ఈరోజు పెండింగ్‌లో ఉన్న స్థానాల్లో అభ్యర్థులను వెల్లడించబోతున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది. సీటు తమకే వస్తుందా? ఇంకెవరికైనా చేజారిపోతుందా అనేది అర్థంకాక వీరంతా తలపట్టుకుంటున్నారు. రెండో దఫా జాబితాలో అయినా తమ నియోజకవర్గంపై స్పష్టత వస్తుందా? రాదా? అనేది తెలియక తమకు తెలిసిన నేతల ద్వారా ఆరాలు తీస్తున్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకుగాను ఇప్పటికే టీడీపీ మూడు, జనసేన ఒకచోట అభ్యర్థులను ప్రకటించాయి. ఇంకా కాకినాడ సిటీ, పిఠాపురం, ప్రత్తిపాడు సీట్లు ప్రకటించాల్సి ఉంది. అటు కాకినాడ ఎంపీ అభ్యర్థి ఎవరనేది కూడా తేలాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గురువారం నాటి సీట్ల జాబితాలో ఇందులో ఏవి ఖరారవుతాయనేది ఆసక్తికరంగా మారింది.

ఏ సీటు ఎవరికో...

టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో జిల్లాలో అసెంబ్లీ సీట్లలో అభ్యర్థుల ఎంపికలో కొంత జాప్యం చోటుచేసుకుంది. ఎన్నికలు సమీపించడంతో ఇరుపార్టీలు ఇప్పుడు స్పీడు పెంచాయి. పొత్తులో భాగంగా కేటాయించిన స్థానాలో ఎవరిని ఎక్కడ నిలబెట్టాలనే దానిపై ఇప్పటికే సుదీర్ఘ కసరత్తు జరిపాయి. అభ్యర్థుల పనితీరు, సామర్థ్యం, సామాజిక సమీకరణాలు, వైసీపీ ప్రత్యర్థి బలాబలాలు ఇవన్నీ అంచనా వేసి గెలుపు గుర్రాలను ఇరుపార్టీలు నిలబెడుతున్నాయి. ఇందులోభాగంగా తొలి విడత జాబితాలో ఇప్పటికే నాలుగుస్థానాల్లో అభ్యర్థులను తేల్చేశాయి. పెద్దాపురం నుంచి మాజీమంత్రి రాజప్ప, జగ్గంపేట నుంచి మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తుని నుంచి యనమల దివ్యకు సీట్లు ఖరారు చేయగా, జనసేననుంచి కాకినాడరూరల్ సీటు పంతం నానాజీకి కేటాయించారు. వీరంతా ఇప్పటికే నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ఇవికాక ఇంకా కాకినాడ సిటీ, పిఠాపురం, ప్రత్తిపాడు సీట్లు ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గురువారం నాటి రెండో జాబితాలో ఈ సీట్లలో ఎన్నింటికి అభ్యర్థులను ప్రకటిస్తారు? లేదా ఎన్ని వాయిదా వేస్తారు? అనేది ఆసక్తికరంగా మారింది. ప్రధానంగా పిఠాపురం సీటుపై రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి నెలకొంది. ఇక్కడినుంచి జనసేన అధినేత పవన్ పోటీచేస్తారని కొంతకాలంగా బలంగా ప్రచారం జరుగుతోంది. దీనికి తగ్గట్టుగానే గొల్లప్రోలులో పవన్ కోసం హెలీప్యాడ్‌ను కూడా పార్టీ సిద్ధం చేసింది. దీంతో ఇక్కడినుంచి పవన్ పోటీ చేస్తారన్న ఊహాగానాలకు మరింత బలం ఇస్తోంది. టీడీపీ నుంచి ఈస్థానంలో మాజీ ఎమ్మెల్యే వర్మ అభ్యర్థిగా ఉన్నారు. దీంతో జనసేననుంచి పవన్ నిలబడితే వర్మను టీడీపీ ఏం చేస్తుంది? వేరే చోటకు సర్దుబాటు చేస్తారా? లేదా ఇంకేదైనా పదవి ఇచ్చి బుజ్జగిస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. అటు పవన్ భీమవరం నుంచి పోటీ చేస్తారని కాదంటే కాకినాడ ఎంపీగాను వెళ్లే అవకాశం ఉందని మరో ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే సీటు తనదేనని వర్మ ధీమాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పిఠాపురం సీటు విషయంలో గురువారం ఏం జరుగుతుందో అనేది ఉత్కంఠ రేపుతోంది. లేదంటే ఆఖరి జాబితాలోకి నెట్టేసి దీన్ని మళ్లీ సస్పెన్స్‌లో ఉంచుతారా? అనేది చర్చ కూడా జరుగుతోంది. ఈ సీటు జనసేనకు కేటాయించినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో జనసేన గురువారం ఈ సీటుపై ప్రకటన చేస్తుందా? లేదా? అనేది ఉత్కంఠ రేపుతోంది. కాకినాడ సిటీ సీటుకు మాజీ ఎమ్మెల్యే కొండబాబు రేసులో ఉన్నారు. కానీ టీడీపీ అధిష్ఠానం ఆయన సోదరుడి కోడలు సుస్మిత, పెద్దాపురం టీడీపీ సీనియర్ నేత గుణ్ణం చంద్రమౌళి పేర్లు పరిశీలిస్తోంది. ఇక్కడ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడిని గట్టిగా ఢీకొట్టే నేతను ఎంపిక చేసేందుకు కొంతకాలంగా అన్ని కోణాల్లో బేరీజు వేస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచి ఎవరి పేరును ఖరారు చేస్తుందనేది ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఈ సీటు తమకు కావాలంటూ కొందరు బీజేపీ ఆశావహులు సైతం తమ ప్రయత్నాలు తాము చేస్తున్నారు. ప్రత్తిపాడు సీటు నుంచి వరుపుల సత్యప్రభ అభ్యర్థిగా కొనసాగుతున్నారు. ఇక్కడ పార్టీలో కొన్ని అంతర్గత సమస్యలు ఉండడం, అటు జనసేన కూడా సీటు కోరుతుండడంతో గతంలో ప్రకటన వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గురువారం ఈ సీటుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. సత్యప్రభకే సీటు ఖాయమనే అంచనాలు నెలకొన్నాయి.

ఎంపీ సీటుపై స్పష్టత వచ్చేనా..

కాకినాడ ఎంపీ సీటుపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. వైసీపీ నుంచి చలమశెట్టి సునీల్ అభ్యర్థిగా ఖరారవడంతో ఇప్పటికే ఆయన ప్రచారం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో రేసులో వెనుకబడకుండా ఈ సీటుకు అభ్యర్థిని వేగంగా ప్రకటించాలంటూ జనసేనపై ఒత్తిడి కొనసాగుతోంది. వాస్తవానికి కాకినాడ ఎంపీ సీటును సానా సతీష్ ఆశిస్తున్నారు. ఎప్పటినుంచో నియోజకవర్గంలో పనిచేసుకుంటున్నారు. తొలుత టీడీపీ అభ్యర్థిగా ఆయన పేరు ఖరారైంది. కానీ పొత్తులో భాగంగా జనసేనకు ఇవ్వడంతో అక్కడినుంచి కూడా ఈయనే అభ్యర్థి అవుతారని ప్రచారం జరుగుతోంది. కానీ ఈ లోపు పవన్ ఎంపీగా పోటీ చేస్తారని బలంగా చర్చ జరగడంతో ఎంపీగా ఎవరు బరిలో ఉంటారనేది గురువారం నాటి జాబితాలో స్పష్టత వస్తుందా? లేదా? అనేది అంతుపట్టడం లేదు. ఒకవేళ పవన్ పోటీ చేయకపోతే సీటు తనదేనని సానాసతీష్ ధీమాగా ఉన్నారు. ఒకవేళ చేస్తే తనకు ప్రత్యామ్నాయంగా ఏదైనా అసెంబ్లీ సీటు ఇవ్వొచ్చని కూడా భావిస్తున్నారు.

ఎన్నికల వేళ ఉత్తుత్తి శంకుస్థాపనలా?



పిఠాపురం మునిసిపల్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, టీడీపీ నేతలు

» పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో ఆందోళన
» అడ్డుకున్న పోలీసులు, తోపులాట.. తీవ్ర ఉద్రిక్తత
» వర్మకు స్వల్ప అస్వస్థత
» అనుమతులు లేకుండా శంకుస్థాపన చేసిన ఎంపీ గీతపై కేసు నమోదు చేయాలని డిమాండ్

పిఠాపురం, మార్చి 13: ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో నిధులు, అనుమతులు లేకుండా కాపు, బీసీ కల్యాణ మండపాలకు శంకుస్థాపన చేయడం వివాదాస్పదంగా మారింది. శంకుస్థాపనకు సహకరించిన మునిసిపల్ కమిషనరు, కలెక్టరుపై చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేకుండా ప్రభుత్వస్థలంలో శంకుస్థాపనచేసిన కాకినాడ ఎంపీ, పిఠాపురం వైసీపీ ఇన్‌చార్జి వంగా గీతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన ఉద్రికత్తలకు దారితీసింది. పోలీసులు, టీడీపీ నేతల మధ్య తోపులాట జరిగింది. వర్మ స్వల్పఅస్వస్థతకు గురయ్యారు.

పిఠాపురం పట్టణ శివారు కాకినాడ రోడ్డులోని స్థలంలో బీసీ కల్యాణ మండపానికి శంకుస్థాపన చేయాలని వైసీపీ నేతలు నిర్ణయించారు. నిధులు, అనుమతులు, కౌన్సిల్ తీర్మానం లేకుండా శంకుస్థాపన ఎలా చేస్తారంటూ మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో రెండురోజుల క్రితం ఆందోళన నిర్వహించారు. మునిసిపల్ కమిషనరు చాంబర్‌లో బైఠాయించారు. నిధులు లేవని, తాము అనుమతులు ఇవ్వలేదని, శంకుస్థాపన వాయిదావేస్తామని కమిషనరు వారికి చెప్పారు. దీనిపై కలెక్టరుకు వర్మ ఫిర్యాదు చేశారు. కానీ, బుధవారం ఎంపీ గీతతో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. ఇది చట్ట విరుద్ధమని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంవద్ద వర్మ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. కార్యాలయాన్ని ముట్టడించారు. శంకుస్థాపనను అడ్డుకోవాలని, దీనిపై చర్యల నిమిత్తం పోలీసులకు ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు. కమిషనరు స్పందించకపోవడంతో బీసీ కమ్యూనిటీహాలు శంకుస్థాపన చేసే స్థలం వద్దకు నేతలతో కలిసి వర్మ బయలుదేరారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించి వారిని అడుకుని కార్యాలయ గేట్లుకు తాళాలు వేశారు.

వాగ్వివాదాలు, తోపులాటలు

పోలీసులు, మునిసిపల్ కమిషనరు వైఖరిపై ఆగ్రహించిన వర్మ వారిని తోసుకుంటూ రోడ్డుపైకి వచ్చారు. అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట, వాగ్వివాదాలు జరిగాయి. దీంతో ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఒకదశలో వర్మ అరెస్టుకు పోలీసులు ప్రయత్నించారు. కొందరు పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. తోపులాటలో ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఎంపీ చేస్తున్న శంకుస్థాపనలకు సీఎస్ఆర్ నిధులు మంజూరు కాలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతూ మునిసిపల్ కమిషనరు లేఖ ఇచ్చారు. దీనిపై కేసు నమోదు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఓటర్లను ప్రభావితంచేసేలా నిధులు, అనుమతులు లేకున్నా కాపు, బీసీ కల్యాణ మండపాలకు ఎంపీ గీత శంఖుస్థాపన చేశారని మాజీ ఎమ్మెల్యే వర్మ ఆరోపించారు. నిధులు లేని శంకుస్థాపనలకు సహకరిస్తున్న కమిషనరు, కలెక్టరు, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా శంకుస్థాపనలకు సహకరిస్తున్న అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. టీడీపీ నేతలు కొండేపూడి సూర్యప్రకాష్, పిల్లి చిన్నా, కోళ్ల బంగారుబాబు, నల్లా శ్రీను, రాయవరపు తిరుమలరావు, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను, వియ్యపు రామన్నరాజు, పొన్నాడ గంగాభవానీ పాల్గొన్నారు.

ఒకటనుకుంటే మరొకటి అయింది

» వలంటీర్లతో వైసీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి సునీల్, పిఠాపురం ఇన్‌చార్జి గీత సమావేశం
» ఎవరు ఎలా పనిచేస్తున్నారో చూసే టెక్నాలజీ ఉందంటూ హెచ్చరికలు



వలంటీర్ల సమావేశంలో చలమలశెట్టి సునీల్, వంగా గీతావిశ్వనాథ్

గొల్లప్రోలు, మార్చి 13: వలంటీర్లతో సమావేశం నిర్వహించి వారిని వైసీపీకి అనుకూలంగా పనిచేయాలని చెప్పారు.. ఆ పార్టీ పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు. వలంటీర్లను తమకు అనుకూలంగా పనిచేయించుకునేందుకు వారికి నచ్చచెబుతూనే ఎవరు ఎలా పనిచేస్తున్నారో తెలుసుకునే టెక్నాలజీ తమ వద్ద ఉందని హెచ్చరించారు.

గొల్లప్రోలు పట్టణ శివారులో ఉన్న ప్రైవేటు ఫంక్షన్‌హాలులో బుధవారం పిఠాపురం నియోజకవర్గంలోని వలంటీర్లతో కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ వైసీపీ సమన్వకర్త చలమలశెట్టి సునీల్, పిఠాపురం అసెంబ్లీ సమన్వయకర్త వంగా గీతావిశ్వనాథ్ సమావేశమయ్యారు. దీన్ని రహస్యంగా నిర్వహించారు. ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి వైసీపీకి ఓటువేసేలా చూడాలని సూచించారు. వలంటీర్లు, పోలింగ్‌బూత్, గ్రామ, మండల, పట్టణ, వార్డు స్థాయి నాయకులు ఎలా పనిచేస్తారో తెలుసుకునే టెక్నాలజీ తమవద్ద ఉందని సునీల్ సమావేశంలో చెప్పడం గమనార్హం. ఇందునిమిత్తం ప్రత్యేక యాప్ రూపొందించామని, ప్రతిరోజూ ఇందులో వివరాలు పొందుపరచాలని సూచించారు. వలంటీర్లను బుజ్జగించేందుకు సమావేశం ఏర్పాటు చేసి వారిని హెచ్చరించేలా మాట్లాడడంపై పలువురు వలంటీర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. వలంటీర్లకు గిఫ్టులు ఇవ్వాలని ముందుగా భావించినా విషయం బయటకు రావడంతో ఏమీ లేకుండానే సమావేశాన్ని ముగించారు. అనంతరం వలంటీర్లకు విందు ఏర్పాటు చేశారు. వలంటీర్లతో రాజకీయ సమావేశం నిర్వహించడాన్ని పలువురు తప్పుపట్టారు. ఏదో చెప్తారని ఊహిస్తే ఏదో చెప్పారని వలంటీర్లు చర్చించుకున్నారు. కాగా ఈ సమావేశానికి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఇదే తరహాలో గండేపల్లిలోను వలంటీర్లకు ఆత్మీయ సమావేశం నిర్వహించి విందు ఇచ్చారు.

తాళం తీసే వరకు లోపలే!



మహిళలు బయటకు వెళ్లకుండా గేటుకు తాళం వేసిన దృశ్యం

» వైఎస్ఆర్ చేయూత చెక్కుల పంపిణీకి హాజరైన మహిళలు
» ఎవరూ బయటకు వెళ్లకుండా తాళం వేసి సిబ్బందిని కాపలా పెట్టిన వైసీపీ నేతలు
» ఇబ్బంది పడిన మహిళలు

జగ్గంపేట, మార్చి 13: జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వైసీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం వైఎస్సార్ చేయూత 4వ విడత సంబరాలు నిర్వహించారు. దీనికి జగ్గంపేట మండలంలోని మహిళా లబ్ధిదారులు హాజరుకాగా నాలుగు మండలాల వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధికసంఖ్యలో వచ్చారు. అనుకున్న దాని కంటే ఎక్కువ సమయం కావడంతో కొందరు మహిళలు బయటకు వెళ్లడానికి ప్రయత్నించారు. వారిని బయటకు వెళ్లనీయకుండా స్థానిక వైసీపీ నాయకులు, అధికారులు మండల పరిషత్ ప్రాంగణం గేట్లకు తాళం వేసి బయట సిబ్బందిని కాపలా పెట్టారు. ఎవరూ బయటకు వెళ్లకుండా చూడాలని చెప్పడంతో సాయంత్రం గృహిణులు నానా అవస్థలు పడ్డారు.

ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్

కాకినాడ సిటీ, మార్చి 13: ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ కృతికాశుక్లా వెల్లడించారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లలో భాగంగా పెండింగ్ ఫారాల పరిష్కారం, ఓటర్ల గుర్తింపు కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంనుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై సమీక్షించారు. దీనికి కాకినాడ కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ కృతికాశుక్లా పాల్గొన్నారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే అమల్లోకి రానున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పర్చేందుకు జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్‌తోపాటు ఎస్పీ సతీష్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై కలెక్టర్ సమీక్ష

కాకినాడ సిటీ, మార్చి 13: జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఫైనాన్సియల్ లిట్రసీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని, ఆర్బీకేల్లో బ్యాంకింగ్ కరస్పాండెంట్ల ద్వారా బ్యాంకింగ్ సేవలను రైతులకు అందుబాటులోకి తేవాలని కలెక్టర్ కృతికాశుక్లా బ్యాంకర్లను కోరారు. బుధవారం కలెక్టరేట్ వివేకానంద హాల్‌లో బ్యాంకర్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో జిల్లాస్థాయి రివ్యూ కమిటీ, కన్సల్టేటివ్ కమిటీ సమావేశాలు కలెక్టర్ అధ్యక్షతన జరిగాయి. సమావేశంలో గత త్రైమాసాంతానికి జిల్లాలో వివిధ రంగాలకు రుణాల కల్పన ప్రగతి, బ్యాంకింగ్ సేవల విస్తరణ తదితర అంశాలపై సమీక్షించారు.

అసంపూర్తి భవనాలకే ప్రారంభోత్సవం



గొల్లప్రోలు మండలం దుర్గాడలో అసంపూర్తి భవనాలను ప్రారంభిస్తున్న ఎంపీ గీత

» ఎన్నికల కోడ్ భయంతో అంతటా హడావుడి
» గొల్లప్రోలులో పనులు పూర్తి కాకుండానే భవనాలను ప్రారంభించేసిన ఎంపీ గీత



గొల్లప్రోలు మండలం తాటిపర్తి జడ్పీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న అదనపు భవనాలు.. దీన్నీ ప్రారంభించేశారు

గొల్లప్రోలు రూరల్, మార్చి 13: ఎన్నికల నోటిఫికేషన్ రాకుండానే ప్రారంభోత్సవాలు చేసేయాలని వైసీపీ నేతలు అత్యుత్సాహపడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలను ప్రారంభించి వాటిపై తమ శిలాఫలకాలు వేసుకుంటున్నారు. నిర్మాణ పనులు పూర్తి కాకుండానే జరుగుతున్న ప్రారంభోత్సవాలు చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.05కోట్లతో తొమ్మిది అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని నాడు-నేడు కింద చేపట్టారు. ఈ పనులు ప్రస్తుతం సాగుతున్నాయి. లోపల టైల్స్ వేయడం, గుమ్మాలు, కిటికీలు బిగించడం, ఎలక్ట్రిఫికేషన్ తదితర పనులు ఏమీ పూర్తి కాలేదు. టైల్స్ వేసే పనులు సాగుతున్నాయి. రెండురోజుల్లో ఎన్నికల కోడ్ రానుండడంతో హడావుడిగా బుధవారం రాత్రి కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్ ప్రారంభించారు. ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దుర్గాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద రూ.84లక్షలతో ఏడు అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఈ అసంపూర్తి భవనాలకే వైసీపీ నాయకులతో కలిసి ఎంపీ గీత ప్రారంభోత్సవం చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మధ్యాహ్నం కార్యక్రమం కావడంతో ఎంపీకి స్వాగతం చెప్పేందుకు పాఠశాలల పనివేళలు ముగిసినా విద్యార్థులను ఉంచారు. ఎంతకు రాకపోవడంతో విద్యార్థులను పంపివేసి ఉపాధ్యాయులు, నాయకులు ఉండిపోయారు. తాటిపర్తి, దుర్గాడ భవనాల్లో ఇంకా 30శాతం వరకూ పనులు చేయాల్సి ఉందని చెబుతున్నారు. కాగా ఈ కార్యక్రమానికి పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు హాజరు కాలేదు.

తాళ్లరేవులోను అసంపూర్తి ప్రారంభాలే..

తాళ్లరేవు, మార్చి 13: త్వరలో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న హడావుడితో అధికారపార్టీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ రూ.9కోట్లతో అసంపూర్తిగా ఉన్న వాటరు ట్యాంకులు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు వాటరు పైపులైన్లకు శంకుస్థాపనలు చేసి సచివాలయం భవనాలను ఆర్భాటంగా బుధవారం ప్రారంభించారు. విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి సదుపాయం, టైల్స్ వేయకుండా సచివాలయం-2ను ప్రారంభించేశారు. తాళ్లరేవు మంచినీటి చెరువువద్ద రూ.2.50కోట్లతో అసంపూర్తిగా నిర్మించిన మైక్రోఫిల్టరుబెడ్డులు, మండల ప్రజాపరిషత్ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న సచివాలయం-2 భవనం, రత్నవారిపేటలో అసంపూర్తిగా ఉన్న వాటరు ట్యాంక్‌లను ప్రారంభించారు. కోరింగ కైట్ కళాశాల వెనుక శ్మశానం పక్కన జగనన్న లేఅవుట్‌ను మొక్కుబడిగా సర్ది సరిహద్దు రాళ్ల పాతిపటవల, కోరింగ లబ్ధిదారులు 268మందికి భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి అధికార పార్టీ ఎంపీపీ రాయుడు సునీత, ముమ్మిడివరం మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ డుమ్మాకొట్టారు. దీంతో వైసీపీలో వర్గపోరు స్పష్టంగా కనిపించింది. తాళ్లరేవు సంతపేట సెంటరులో వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు.



జేసీగా బాధ్యతలు స్వీకరించిన రామ్‌సుందర్‌రెడ్డి

నూతన జేసీ బాధ్యతల స్వీకరణ

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 13: జిల్లా నూతన జేసీగా ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా జేసీగా పనిచేస్తున్న ఆయన్ను కాకినాడ జిల్లా జేసీగా ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన కలెక్టర్ కృతికాశుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో వివిధ అంశాలపై ఇద్దరూ చర్చించారు. నూతన జేసీకి జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు, ఏవో శ్రీనివాసు శుభాకాంక్షలు తెలియజేశారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు జిల్లా ప్రాజెక్టు ఎంపిక
- 7లో

మహిళా సాధికారతకు 'కలలకు రెక్కలు'తో కీలక ముందడుగు



» పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, మార్చి 13: మహిళా సాధికారత దిశగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మరో కీలక ముందడుగు వేశారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. బుధవారం సామర్లకోట మండలం అచ్చంపేటలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలలకు రెక్కలు అనే పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళలకోసం తీసుకొచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏ ఆడబిడ్డ కూడా డబ్బుల కొరతతో చదువు లేకుండా ఇంటికి పరిమితం కాకూడదనే ఆలోచనతో ఈ పథకాన్ని తీసుకుని వచ్చారన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన యువతులు ఈ పథకం కింద దరఖాస్తుకు అర్హులన్నారు. ఈ పథకం కింద నమోదు చేసుకున్న మహిళలు తీసుకునే బ్యాంకు రుణానికి తెలుగుదేశం-జనసేన ఉమ్మడి ప్రభుత్వం బాధ్యత(హామీ) వహిస్తుందన్నారు. ఈ పథకం కింద కోర్సుల కోసం యువతులు తీసుకునే మొత్తం రుణానికి సంబంధించిన వడ్డీని కూడా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఏ తెలుగింటి ఆడబిడ్డ నిధుల కొరత కారణంగా తమ కలలతో రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. ఇందుకు సంబంధించి మహిళలు www.kalalakurekkalu.com వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని ఒక సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. రిజిస్టర్ చేసుకున్న మహిళలు తమ సమీపంలో నోటిఫైడ్ బ్యాంక్‌కు వెళ్లి తర్వాతి ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ లింక్ పొందేందుకు 92612 92612కు మిస్డ్ కాల్ ఇవ్వాలని సూచించారు.

పవన్, చంద్రబాబు కలయికతోనే విజయం నిశ్చయమైంది

» శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు




సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణుడు

తొండంగి, మార్చి 13: జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు కలయికతోనే టీడీపీ-జనసేన విజయం నిశ్చయమైందని శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం ఆయన తొండంగి మండలం పీఈ చిన్నయ్యపాలెంలో టీడీపీ సమావేశంలో మాట్లాడారు. జనసేన, టీడీపీ, బీజేపీ కలయికతో రాష్ట్రంలో ఉమ్మడిగా ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్నందున మూడు పార్టీల కార్యకర్తలు నిబద్ధతతో పనిచేసి విజయానికి కృషి చేయాలన్నారు. పాత, కొత్తల కలయికతో టీడీపీ గెలుపునకు కార్యకర్తలంతా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను గమనించిన ప్రజలంతా చంద్రబాబు ప్రభుత్వంకోసం ఎదురు చూస్తున్నారన్నారు. తుని నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దివ్యను భారీ మెజార్టీతో గెలిపించే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు.

19 నుంచి కోరుకొండ తీర్థం ప్రారంభం

- ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు
- ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన అధికారులు, పండితులు





పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, పండితులు

కోరుకొండ,మార్చి13: శతాబ్దాల చరిత్ర కలిగిన కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ముఖ మండపం నందు దేవస్థానం చైర్మన్ పరాసర రంగరాజభట్టర్ స్వామి, దేవస్థానం పర్యవేక్షణాధికారి కాపవరపు సూర్యనారాయణ, ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తి, చంగన వీర్రాజు, పీఎస్ అనీల్‌కుమార్ తదితరులు ఉత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దీని ప్రకారం ఈ నెల 19వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటలకు వైఖానస ఆగమ పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, అనువంశిక అర్చక స్వాములు స్వామి వారి కోనేరు వద్ద నుంచి పుట్ట మన్ను తెచ్చి అంకురార్పణ, ధ్వజారోహణం చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 20వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామి వారి రథోత్సవం. రాత్రి 9 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, 21వ తేదీ గురువారం కొండపైన, కొండ దిగువున స్వామి వారి దర్శనాలు, రాత్రి 9గంటలకు స్వామి వారికి గరుడ వాహన సేవ నిర్వహిస్తారు. 22వ తేదీ శుక్రవారం ఉదయం నిత్యోపాసనతో స్వామివారి దర్శనాలు ప్రారంభమవతాయి. రాత్రి 7 గంటలకు స్వామి వారి ఆలయ ముఖ మండపంలో వేద పండితుల సమక్షంలో స్వామి వారికి సదస్యం జరుగును. రాత్రి 9 గంటలకు హనుమద్ వాహనంపై స్వామి గ్రామోత్సవం జరుగుతుంది. 23వ తేదీ శనివారం స్వామి వారి నిత్యోపాసన అనంతరం దర్శన ఏర్పాట్లు చేస్తారు. రాత్రి 9గంటలకు స్వామి వారికి గజవాహనంపై గ్రామోత్సవం. అదే రోజు రాత్రి 7 గంటలకు శ్రీ రంగరాజ స్వామి ఆలయంలో రంగరాజస్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 24వ తేదీ ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి ఉదయం 9 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి, శ్రీ అనంతపద్మనాభ స్వామివారి సమక్షంలో దేవుని కోనేటి వద్ద శ్రీ చక్ర పెరుమాళ్ళకు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అనంతరం చక్ర తీర్థం జరుగుతుంది. సాయంత్రం ధ్వజారోహణ, అద్దాల సేవ, ఊంజల సేవ నిర్వహిస్తారు. రాత్రి 9గంటలకు స్వామివారి శేషవాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. 25వ తేదీ సోమవారం సాయంత్రం స్వామి వారికి ద్వాదశప్రదక్షిణలు, ద్వాదశ నివేదనలు, పర్యాంక శయనోత్సవం, శ్రీ పుష్పయాగం జరుగుతుందని రంగరాజభట్టర్ స్వామి తెలిపారు.



అధికారులు, ఉపాధ్యాయులతో విద్యార్థులు

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు ప్రాజెక్టుల ఎంపిక

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నుంచి రెండు వైజ్ఞానిక ప్రదర్శనలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయని జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ చిత్తూరు జిల్లా గంగవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ జరిగిందన్నారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బైశెట్టి లక్ష్మణ్, గైడ్ టీచర్ మల్లిపూడి రాజు రూపొందించిన రైతుబంధు అనే వ్యవసాయ యంత్రం, సీతానగరం మండలంలోని రఘుదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.నాగేంద్రకుమార్, గైడ్ టీచర్ జి.శేఖర్ రూపొందించిన చేతితో సులభంగా కొబ్బరికాయ ఒలిచే యంత్రం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. విద్యార్థులను, గైడ్ టీచర్లను జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి, డిప్యూటీ ఈవో ఈవీబీఎన్ నారాయణ, జిల్లా సైన్సు అధికారి నెహ్రూ అభినందించారు. రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

జాతీయ సైన్స్ పోటీలకు ఎంపిక



కాకినాడ రూరల్,మార్చి13: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు కాకినాడ జిల్లా నుంచి ఒక ప్రాజెక్టు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ అర్బన్ మండలం గొడారిగుంట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు చెందిన గుత్తుల అనుష్క రూపొందించిన సీడర్ ఫర్ స్మాల్ స్కేల్ ఫార్మర్స్ అనే ప్రాజెక్టు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 11నుంచి 13వతేదీ వరకూ చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలు నిర్వహించారన్నారు. చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 240 ప్రాజెక్టులు ప్రదర్శించగా వాటిలో 24 ప్రాజెక్టులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయన్నారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా నుంచి జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టును రూపొందించిన గుత్తుల అనుష్కను, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు చంద్రారెడ్డిని ఆర్జేడీ జి.నాగమణి, డీఈవో పి.రమేష్, డీవైఈవో ఆర్జే డేనియల్ రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ అభినందించారు.

ఇదేం స్పీడు..

ఊబలంక ర్యాంపు వద్ద లారీ డ్రైవర్లతో వైసీపీ యువకుల వాగ్వాదం

అనంతరం పార్టీ పెద్దలతో చర్చలు

'లెక్క' తేలక ఊబలంక ఇసుక ర్యాంపు నిలిపివేత



నిలిచిపోయిన తవ్వకాలు

రావులపాలెం, మార్చి 13: ఇసుక ర్యాంపులకు అనుమతులు లేకపోయినా ఊబలంక ప్రాంతం నుంచి రోజుకు వందలాది లారీల్లో ఇసుక తరలిపోతోంది. ఇదే విషయంపై వైసీపీ నాయకులను ఆ పార్టీలోని యువకులే ప్రశ్నించారు. అసలు ఇసుక ఎక్కడికి పోతోంది. ఆదాయం ఎక్కడికి వెళ్తోంది..అనే కోణంలో ప్రశ్నల వర్షం కురిపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక ఇసుక ర్యాంపు నుంచి నిబంధనలకు విరుద్ధంగా రోజూ వందలాది లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. మంగళవారం రాత్రి మితిమీరిన వేగంతో లారీలు ప్రయాణిస్తుండడంతో గ్రామంలో వైసీపీకి చెందిన యువకులు ర్యాంపులోకి వెళ్లి లారీ డ్రైవర్లను నిలదీశారు. మితిమీరిన వేగంతో వెళ్తున్న కారణంగా లారీల్లో ఇసుక లోడ్ చేయడాన్ని అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్లు, యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఇసుక జట్టు మేస్త్రీ వారిని వారించే ప్రయత్నం చేసి ఘర్షణకు దిగాడు. దీంతో యువకులు ఆవేశానికి గురై ర్యాంపు మూసివేయాలని నినాదాలు చేశారు. కాగా యువకులతో రావులపాలెంలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ పెద్దలు చర్చలు జరిపినట్టు సమాచారం. ఆ సమయంలో యువకులు ఇసుక ర్యాంపు ఎవరు నడుపుతున్నారు.. ర్యాంపు నుంచి వచ్చే ఆదాయం ఎక్కడికి వెళ్తోంది... గతంలో ఏ విధంగా నడిచేది... ఇప్పుడు ఏ విధంగా నడుస్తోంది అని పెద్దలను నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య చర్చలు ఫలించకపోవడంతో ఇసుక ర్యాంపు తాత్కాలికంగా మూతపడింది. అయితే గ్రామంలో మరోమారు చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సార్.. గురు దక్షిణ

కాకినాడలో ఓ బీజేపీ ఆశావహ అభ్యర్థి అప్పుడే డబ్బుల ఎర

టికెట్ ప్రయత్నాలకు ఆశీర్వాదం కోరుతూ బీజేపీ కీలక నేతలకు స్వీట్ బాక్సులు

అందులో రూ.20వేల వరకు నగదు ఉంచి అందజేత

గురు దక్షిణ తీసుకోవాలంటూ స్వయంగా కలిసి విన్నపం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి) కాకినాడలో ఓ ప్రముఖ ఇంజనీరింగ్ విద్యాసంస్థ యజమాని టికెట్ కోసం ఏకంగా బరితెగించేశాడు. బీజేపీలో సీనియర్ నేతలకు స్వీట్ బాక్సులు పంపి అందులో నగదు కవర్ అందించడం తీవ్ర దుమారం రేపుతోంది. కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఆశిస్తున్న ఈయన కొన్ని రోజులుగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పొత్తులో భాగంగా బీజేపీ పది అసెంబ్లీ సీట్లు దక్కించుకున్న నేపథ్యంలో అందులో కాకినాడ సిటీ సీటు కూడా ఉండేలా చూడాలని, ఆ టికెట్ తనకు వచ్చేలా ఆశీర్వదించాలంటూ నగరంలో అనేకమంది బీజేపీ సీనియర్ నేతలందరినీ కలుస్తున్నారు. వారందరికీ శాలువాలు కప్పి స్వీట్ బాక్స్‌లు అందిస్తున్నారు. అందులో రూ.20 వేల వరకు నగదు ఉంచి గురుదక్షిణ అంటూ వారి కాళ్లపై పడుతున్నారు. తీరా స్వీటు బాక్సులు తెరిచి చూస్తే అందులో నగదు ఉండడం చూసి బీజేపీ నేతలు అవాక్కవుతున్నారు. అసలు సదరు నేత ఇంకా బీజేపీలో కూడా చేరలేదు. కానీ నగరం అంతటా మోదీని పొగుడుతూ ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. అటు ఆరెస్సెస్ నేతలను కలిసి సీటు ఆశీర్వాదం పొందారని ఆయన ప్రచారం చేసుకుంటున్నారు. ఇలా స్వీటు బాక్సులు అందుకున్న కొందరు సీనియర్లు వాటిని వెనక్కు తిప్పి పంపేశారు. గురుదక్షిణ పేరుతో తమకు డబ్బులు ఇవ్వడంపై ఫోన్ చేసి చివాట్లు కూడా పెట్టారు. పార్టీలో లేని సంస్కృతిని తీసుకురావడంపై మండిపడుతున్నారు. కాగా సదరు విద్యాసంస్థల యజమాని కాకినాడ సిటీ, పిఠాపురం తదితర స్థానాల్లో గతంలో పలు పార్టీల నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

నేను గెలిచేందుకు సాయం చేయండి

మీకు ఇబ్బందొస్తే నేను చూసుకుంటా

వలంటీర్లతో కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం, మార్చి 13: 'వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నా విజయానికి మీరు కృషి చేయండి... మీకు ఏదైనా ఇబ్బంది వస్తే నేను చూసుకుంటా' అని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వలంటీర్లకు దిశా నిర్దేశం చేశారు. రావులపాలెంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం ఆయన బూత్ ఏజెంట్లు, గృహ సారథులు, వైసీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి వలంటీర్లు కూడా హాజరుకావడం విశేషం. రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు మండలాలకు చెందిన వారు హాజరు కాగా టేబుళ్లు, కుర్చీలు వేసి వారి ముందు ఓటర్ల జాబితాలు పెట్టారు. 2019 ఎన్నికల్లో బూత్‌ల వారీగా వచ్చిన మెజారిటీ, ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయి అన్న అంశాలను పరిశీలించారు. బూత్‌లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి వివరాలనూ సేకరించారు. అనంతరం జగ్గిరెడ్డి టేబుళ్ల వద్దకు వెళ్లి అక్కడున్న వారికి వైసీపీకి ఓట్లు పడేలా చూడాలని సూచించారు. మీకు కేటాయించిన కుటుంబాల వారు వైసీపీకి ఓటు వేసేలా ఓటర్లను చైతన్యపరచాలని వలంటీర్లకు స్పష్టం చేయడం విశేషం.



ఓటర్ల లిస్టును పరిశీలిస్తున్న వలంటీర్లు, గృహసారథులు

రెండోసారి..

వంతెన నిర్మాణ పనులకు నాడు భూమి పూజ...

నేడు శిలాఫలకం ఆవిష్కరణ

ఎన్నికల వేళ వైసీపీ నాయకుల హంగామా



పనులు జరుగుతున్న దృశ్యం

పి.గన్నవరం, మార్చి 13: అప్పుడు భూమి పూజ చేశారు... ఇప్పుడు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వైసీపీ ప్రజాప్రతినిధులు చేస్తున్న పీట్లు అన్నీ ఇన్నీ కావు. ఈ విచిత్ర పరిస్థితి గంటి పెదపూడిలో బుధవారం చోటుచేసుకుంది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి శివారు మూడు గ్రామాలు, ఉడిమూడి శివారు ఒక గ్రామానికి చెందిన లంక గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి వంతెన నిర్మాణం నిమిత్తం గత ప్రభుత్వ హయాంలో రూ.49.50 కోట్లు మంజూరయ్యాయి. కాగా గతేడాది అతికష్టం మీద ఒక ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీకి టెండర్లను ఖరారు చేశారు. అనంతరం వంతెన ఏర్పాటు విషయమై రెండు లంక గ్రామాల మధ్య నెలకొన్న విభేదాలను సైతం అధిగమించి చింతావారిపేట వద్ద వంతెన పనులకు గత ఏడాది మార్చి 22న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు భూమి పూజ చేశారు. వంతెన పనులు ఇప్పటికే 50శాతానికి పైగా పూర్తి కాగా ప్రధాన వంతెన పనులు సైతం చురుగ్గా సాగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన వంతెన పనుల సమీపంలో ఏటిగట్టుపై గతేడాది ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకం ఏర్పాటు చేశారు. బుధవారం దానిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, వైసీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆర్భాటంగా ప్రారంభించారు. సర్పంచ్ దంగేటి అన్నవరం మినహా మిగిలిన స్థానిక ప్రజా ప్రతినిధులు ఎవ్వరూ హాజరు కాలేదు. అనధికార కార్యక్రమం కావడంతో అధికారులు సైతం దూరంగా ఉన్నారు. ప్రారంభించిన పనులనే మళ్లీ ప్రారంభించి వైసీపీ నాయకులు హంగు, ఆర్భాటం చేశారని ప్రజలు వ్యాఖ్యానించారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏప్రిల్ 5 నుంచి ఆర్ట్స్ కళాశాలలో

రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ పేరుతో ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్ జరగనుంది. కళాశాల ఆవరణలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో యూత్ ఫెస్టివల్‌కు ఉద్భవ్ అనే పేరును నిర్ణయించారు. కళాశాల విద్యార్థిని శివశంకరి ఆధ్వర్యంలో విద్యార్థులు తమ చేతి గుర్తులతో వేసిన బ్యానర్‌ను కళాశాల భవనంపై ఆవిష్కరించారు. విద్యార్థి వ్యాపారాభివృద్ధి (స్టూడెంట్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్) అనే నినాదంతో యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ అధ్యాపకుల ప్రమేయం లేకుండా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులు నిర్వహించే మొదటి స్టూడెంట్ ఫెస్ట్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ డి.సంజీవ్‌కుమార్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ, ఫెస్ట్ కో ఆర్డినేటర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

గోపాలపురం, మార్చి 13: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని వాహనాన్ని రెవెన్యూ, పోలీస్ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సీఎస్‌డీటీ తాతపూడి దివాకర్, పోలీస్ సిబ్బంది సహకారంతో రూ.2 లక్షల 8 వేలు విలువ చేసే పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకుని వాహనం సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 11గంటల సమయంలో విధులు నిర్వహిస్తుండగా గోపాలపురం శివారులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఐషర్ వ్యాన్ పై పీడీఎస్ బియ్యం తనిఖీల్లో బయటపడ్డాయన్నారు. 130 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.2 లక్షల 8 వేలు ఉంటుందన్నారు. కాకినాడ జిల్లాకు చెందిన అల్లుమల్లు రాముని అదుపులోకి తీసుకుని సీఎస్‌డీటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు.

భీమేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.29,46,474



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సామర్లకోట, మార్చి 13: పంచారామ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈ నెల 6 నుంచి 11 వరకూ జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల నుంచి హుండీల ద్వారా, పూజా రుసుముల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం రూ.29 లక్షల 46 వేల 474 లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం వెల్లడించారు. బుధవారం ఉదయం నుంచి భక్త మండలి కమిటీ ప్రతినిధులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. గత ఏడాది ఆదాయంతో పోలిస్తే కేవలం రూ.3.80 లక్షలు మాత్రమే అదనంగా లభించింది. ఉత్సవ ఖర్చులు మాత్రం పెద్ద మొత్తంలో అయినట్లు సమాచారం. మహాశివరాత్రి ఉత్సవాలలో భక్తుల దర్శనాల ద్వారా రూ.9,00,910, సేవలో రూ.92,517, అన్నదానాల విరాళాల ద్వారా రూ.5,05,922, హుండీల ద్వారా రూ.12,00,080, లడ్డూల ద్వారా రూ. 1,42,815, పులిహోర విక్రయాల ద్వారా రూ. 1,04,830 లభించినట్లు తెలిపారు. గత ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలకు రూ. 25,26,555 ఆదాయం లభించినట్లు ఈవో నీలకంఠం తెలిపారు.

వర్చువల్‌గా ప్రధానమంత్రి

సూరజ్ పథకం ప్రారంభం



వర్చువల్‌గా పథకాన్ని ప్రారంభిస్తున్న మోదీ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13 : ప్రధానమంత్రి సూరజ్ పథకాన్ని బుధవారం సాయంత్రం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన దూరదర్శన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డీవీ ప్రసాద్, సాంఘిక సంక్షేమాధికారి సందీప్ మాట్లాడుతూ సూరజ్ పథకంలో పారిశుధ్య కార్మికులకు జిల్లాలోని కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో 4 కిట్లు, నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో 29 కిట్లు అందజేసినట్టు తెలిపారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థ ద్వారా ఎస్సీ లబ్ధిదారులకు, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థ ద్వారా సహాయం పొందిన సఫాయి కర్మాచారి లబ్ధిదారులకు, ఎన్‌బీసీఎఫ్‌డీసీ ద్వారా ఆర్థిక సహాయం పొందిన బీసీ స్వయం ఉపాధి లబ్ధిదారులకు రూ.14,50,68,219ల ఆర్థిక ప్రయోజనం చేకూర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు పి.సువర్ణ, భానుప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల

అరెస్టు

కడియం, మార్చి 13: కడియపులంకలో ఓ పేకాట శిబిరంపై బుధవారం కడియం పోలీసులు దాడి చేశారు. సీఐ బి తులసీధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడియపులంక ఏటిగట్టు ప్రాంతంలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని, ఒక వ్యక్తి పారిపోయాడని తెలిపారు. వారి నుంచి రూ.9,740, ఐదు సెల్ ఫోన్లు, ఐదు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట శిబిరాలపై నిరంతర నిఘా ఉంచామని ఈ సందర్భంగా సీఐ తులసీధర్ తెలిపారు.

అనుమతులు లేకుండా మెడిసిన్ విక్రయిస్తే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అవసరమైన అనుమతులు పొందకుండా మందులు (మెడిసిన్) విక్రయించడం నేరమని విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని డ్రగ్స్ విక్రయ సంస్థల పార్శిల్ కార్యాలయాల్లో, గోదాముల్లో బుధవారం తనిఖీలు చేశామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాదాలమ్మనగర్‌లోని ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, టీసీఐ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ పార్శిల్ కార్యాలయాల్లో సోదాలు చేసి ట్రేడ్ లైసెన్సులు లేకపోవడం గుర్తించామన్నారు. వారికి మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నోటీసులు జారీ చేశారని చెప్పారు. శాంపిల్ మందులు ఉండడంతో వాటిని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సీజ్ చేసి నోటీసులు ఇచ్చారన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలునాయుడు, సిబ్బంది వెంకట నాగరాజు, భార్గవ మహేశ్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

పసిబాలుడిని

గోనె సంచిలో కట్టి వదిలేశారు..

గమనించి జీజీహెచ్‌కు తరలించిన స్థానికులు



సర్పవరం జంక్షన్, మార్చి 13: ఎవరికి ఏం కష్టమొచ్చిందో..ఏం అడ్డం వచ్చిందో తెలియదు కానీ రోజుల వయస్సు ఉన్న పసి బాలుడిని కాకినాడ బోట్‌క్లబ్ దగ్గర వదిలేసి వెళ్లిపోయారు. కాకినాడ ఒకటో డివిజన్ పరిధిలో బోట్‌క్లబ్ పార్కు ఉంది. దీని ప్రధాన ద్వారం పిఠాపురం వెళ్లే రహదారిలో ఉంది. బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో పార్కులో నుంచి చిన్నారి గుక్కతిప్పుకోకుండా ఏడుస్తున్న విషయాన్ని గమనించిన సందర్శకులు గోనె సంచి మూట విప్పి చూడటంతో రోజుల వయసు ఉన్న బాబు ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. అప్పటికే చిన్నారి నోటి నుంచి నురగలు రావడం, శరీరంపై పొక్కులు రావడాన్ని గమనించి, వెంటనే 108 కు సమాచారం అందించగా, మెరుగైన చికిత్స కోసం చిన్నారి బాలుడిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు ఎన్ఐసీయూలో ఉంచి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. చిన్నారి వయసు 3 నుంచి 5 రోజులు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. చిన్నారిని పార్కులో వదిలేసి అప్పటికే 10 నిమిషాలు అయి ఉంటుందని, వెంటనే సందర్శకులు గమనించి సమాచారం ఇవ్వడంతో బాలుడికి ప్రమాదం తప్పిందని వైద్యులు భావిస్తున్నారు. బోట్‌క్లబ్ పార్కు లోపల, బయట వీధికుక్కల గుంపు ఉందని, చిన్నారిని కుక్కలు చూచి ఉంటే పరిస్థితి ఘోరంగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

వేట్లపాలెంలో 'బేటీ బచావో - బేటీ పడావో'

సామర్లకోట, మార్చి 13: మండలంలోని వేట్లపాలెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ పెద్దాపురం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బేటీ బచావో - బేటీ పడావో పేరిట అవగాహనా సదస్సు బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జి.ఉషా మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ఉషా, గ్రామ పెద్ద పెదబాబు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'కాకినాడను దోచుకుంటున్న ద్వారంపూడి'

కాకినాడ సిటీ, మార్చి 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాకినాడ నగరాన్ని స్మార్ట్‌సిటీగా ఎంపిక చేసి సుందరీకరణంగా తీర్చిదిద్దితే తన అక్రమ సంపాదనకు నేడు ఎక్కడికక్కడ అక్రమ కట్టడాలు, కబ్జాలు చేపట్టి ఎమ్మెల్యే ద్వారంపూడి కాకినాడను దోచుకుంటున్నాడని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. కాకినాడ మెయిన్‌రోడ్ మసీదు సెంటర్, సినిమారోడ్ సంతచెరువు సెంటర్‌వద్ద అక్రమ కట్టడాలను బుధవారం ఆయన మీడియాకు చూపించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నగర సుందరీకరణలో భాగంగా చేపట్టిన రోడ్ల విస్తరణలో స్థలాలు కోల్పోయిన యజమానులకు నష్టపరిహారం ఇచ్చి నగరాన్ని తీర్చిదిద్దామన్నారు. ద్వారంపూడి తన అక్రమ సంపాదన కోసం ప్రధాన కూడలిలలో షాపులు కట్టించి వాటిపై అద్దెలు వసూలు చేస్తూన్నారన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, బంగారు సత్యనారాయణ, పొంగా బుజ్జి, గదుల సాయిబాబు, చింతలపూడి రవి, ఆలీషా, గబ్బర్‌సింగ్, పందరి బాబి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలి'

సర్పవరం జంక్షన్, మార్చి 13: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో నమోదైన డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని టీఎస్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం సర్పవరం జంక్షన్ తహశీల్దార్ కార్యాలయంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్‌కు జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ కుమారుడు సందీప్‌తో కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలోని 264 పోలింగ్ బూత్‌లలో సుమారు వెయ్యి ఓట్లకు పైగా డబుల్ ఎంట్రీలు ఉన్నాయన్నారు. డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన వారి ఓట్లు తదితర వాటిపై బీఎల్వోలతో వెరిఫికేషన్ చేయించాలని కోరారు.

'తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి'

కరప, మార్చి 13: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీడీవో కొంకి అప్పారావు కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. బోర్లు, వాటర్ ట్యాంక్‌లు, పైప్ లైన్లను తరచుగా పరిశీలిస్తూ మరమ్మతులుంటే వెంటనే చేయించాలన్నారు. తాగునీరందని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఎన్నికల కోడ్ రానున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో రాజకీయపార్టీల ఫ్లెక్సీలను తొలగించడానికి సమాయత్తం కావాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వం కుట్రలు మానుకోవాలి'

తాళ్లరేవు, మార్చి 13: వైసీపీ ప్రభుత్వం పేదల పట్ల చేస్తున్న కుట్రలు మానుకుని స్థానికంగా ఉన్న చొల్లంగిలోనే పేదలకు పట్టాలివ్వాలని పలువురు లబ్ధిదారులు డిమాండ్ చేశారు. బుధవారం 43వ రోజు నిరసనలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు మాట్లాడుతూ అధికార పార్టీకి పేదల ఓట్లు తప్ప వారి అవసరం లేదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన లబ్ధిదారులందరికీ వారు కోరుకున్న చోటే ఇళ్ల స్థలాలిస్తామని హామీ ఇచ్చారు.

'అధికారులు అందుబాటులో ఉండాలి'

ఏలేశ్వరం, మార్చి 13: వ్యవసాయదారులకి అధికారులు అందుబాటులో ఉండాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. వ్యవసాయ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు సాగువ్యవసాయం అయినప్పటి నుంచి పంటచేతికి వచ్చే వరకూ అధికారులు, సిబ్బంది సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే రైతులను ఆదుకుంటామన్నారు. వ్యవసాయాధికారి జ్యోతి, సిబ్బంది ఉన్నారు.

'పాలకులలో కొరవడిన చిత్తశుద్ధి'

సామర్లకోట, మార్చి 13: శ్రామిక మహిళలకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్న చిత్తశుద్ధి కేంద్ర,రాష్ట్ర పాలకులలో కొరవడిందని చంద్రవతి, సీఐటీయూ కమిటీ కార్యదర్శి వడ్డి ఎస్తేరు రాణిలు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సామర్లకోట సీఐటీయూ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ నాయకులు నాగమణి, లక్ష్మి, మహాలక్ష్మి, లోవకుమారి, మంగాలక్ష్మి, వాణీ, రజని, కె.ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

సిమెంటురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తపల్లి, మార్చి 13: అరబిందో ఇన్‌ఫ్రా కంపెనీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శ్రీరాంపురం శివారు ముమ్మిడివారిపోడు గ్రామంలో రూ.కోటి అంచనా వ్యయంతో నిర్మించనున్న సిమెంటురోడ్డుకు కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ బుధవారం శంకుస్థాపన చేశారు. అడిగినదే తడవుగా సుమారు సుమారు రూ.కోటి నిధులను మంజూరు చేసిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పి.శరత్‌చంద్రారెడ్డికి ఎంపీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీరాంపురం సర్పంచ్ రావి రమేష్, వైసీపీ రాష్ట్ర నాయకులు రావు చిన్నా రావు, వెంగలి సుబ్బారావు, కొత్తపల్లి మండల రైతు భరోసా కేంద్ర సలహా సంఘ అధ్యక్షులు జ్యోతుల బాబులు, అరబిందో ఫార్మా కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి సాయం

సామర్లకోట, మార్చి 13: మండలంలో పి.వేమవరానికి చెందిన కొండపల్లి శ్రీనివాస్ కుటుంబానికి బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు చేతుల మీదుగా రూ.5లక్షల ఆర్థిక సాయానికి చెందిన బీమా చెక్‌ను అందజేశారు. శ్రీనువాస్ జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తగా సభ్యత్వం ఉండగా ఇటీవల ప్రమాదంలో మృతిచెందడంతో బీమా చెక్‌ను అందజేశారు. నాయకులు మేడిది విజ్ఞేశ్వర నాగబాబు, కొండపల్లి రాంబాబులు పాల్గొన్నారు.

వేట్లపాలెం ఇన్‌చార్జి సర్పంచ్‌గా శ్రీరామ్

సామర్లకోట, మార్చి 13: మండలంలో వేట్లపాలెం గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా ప్రస్తుతం గ్రామ ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీకి చెందిన కోట్లాది ప్రభుత్వ నిధులు దుర్వినియోగం య్యాయనే విషయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్ సీహెచ్.వెంకటలక్ష్మిని 3 నెలల పాటు 6.6.2024 వరకూ సస్పెండ్ చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. చెక్‌పవర్‌ను సామర్లకోట మండల ఈవోపీఆర్డీ అధికారికి మాత్రమే అప్పగిస్తూ సబ్‌ట్రెజరీ కార్యాలయానికి కూడా డీపీవో జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నారు.

పిఠాపురంలో పోలీసుల కవాతు

పిఠాపురం, మార్చి 13: ఎన్నికల సన్నద్ధతలో భాగంగా పట్టణంలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసులు, అధికారులు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. కవాతులో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మురళీమోహన్ పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

వేళంగి (కరప), మార్చి 13: వేళంగిలో నూతనంగా నిర్మించిన గ్రామసచివాలయ భవనాన్ని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ ప్రారంభించారు. సర్పంచ్ సవిలే నీలిమారాజేష్, వైస్‌ఎంపీపీ బొమ్మిడి వీర్రాఘవులు, ఎంపీటీసీ ముషిని సూరిబాబు, వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జీలకర్ర దుర్గారావు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ అభివృద్ధికి కోరమాండల్ నిధులు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 13: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం కోరమాండల్ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.52లక్షల చెక్కును కోరమాండల్ పోషక ఎరువుల విభాగం ప్రెసిడెంట్ అమీర్ ఆల్వీ కలెక్టర్ కృతికాశుక్లాకు అందించారు. నిధులను కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి, ఇతర మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం వినియోగించనున్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ కాకినాడ హెడ్ సీహెచ్.శ్రీనివాసరావు, జీఎంహెచ్ఆర్ పద్మనాభం పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న కోరమండల్ ప్రెసిడెంట్

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

కరప, మార్చి 13: మోటర్ సైకిల్ ఢీకొని ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడినట్టు కరప పోలీసులు తెలిపారు. కాకినాడరూరల్ మండలం తూరంగికి చెందిన దడాల అప్పారావు మంగళవారం రాత్రి కరప మండలం నడకుదురు వైపు వాకింగ్‌కు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. కుసుమ సత్య ఫంక్షన్ హాల్ వద్దకు వెళ్లేసరికి వెనుక నుంచి మోటర్‌సైక్లిస్ట్ బలంగా ఢీకొన్నాడు. క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

» వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చిన శ్రేణులు

» పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన నేతలు



తొండంగి: టీడీపీలో చేరినవారితో యనమల



పెద్దాపురంలో టీడీపీ కండువా కప్పుతున్న రాజప్ప



గండేపల్లి: టీడీపీలో చేరినవారితో నెహ్రూ

తొండంగి, మార్చి 13: తొండంగి మండలం పిఇ చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలతో సహా భారీగా కార్యకర్తలు శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం చిన్నయ్యపాలెంలో తొండంగి మాజీ వైస్ ఎంపీపీ వడ్డి రాంబాబు, చిన్నయ్యపాలెం మాజీ సర్పంచ్ ములికి రామకృష్ణ, పిఏసీఎస్ త్రీమెన్ కమిటీ సభ్యుడు వడ్డి నాగేశ్వర్రావుతో పాటు పలువురికి యనమల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో తుని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు, నాయకులు మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, ఇనుగంటి సత్యన్నారాయణ, పేకేటి హరికృష్ణ, పార్టీ మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, కొయ్యా రామకేశవ, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు సోమిశెట్టి నాయుడు, చోడిశెట్టి గణేష్ ఉన్నారు.

తుని రూరల్: గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట యనమల స్వగృహంలో టీడీపీ, జనసేన కార్యకర్తలతో సమావేశమైన ఆయన క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్షించారు. నిరంతరం ప్రజలతో మమేకమై ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టీడీపీ, జనసేన మేనిఫెస్టో అంశాలు తెలియజేయాలని కోరారు. 3 మండలాలకు చెందిన పలువు, టీడీపీ, జనసేన కార్యకర్తలు ఉన్నారు.

పెద్దాపురంలో...

పెద్దాపురం, మార్చి 13: పారిశ్రామికాభివృద్ధిని వైసీపీ పూర్తిగా పక్కన పెట్టేసిందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణంలో రాజాసూరిబాబురాజు స్వగృహం వద్ద టీడీపీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి పారిశ్రామికాభివృద్ధిని పూర్తిగా తుంగలోకి తొక్కేసిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెటాలంటే పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలను నిరుద్యోగులకు కల్పించడం జరుగుతుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతీఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని కార్యకర్తలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు తనయుడు దినేష్‌రాజు ఆధ్వర్యంలో 100మంది టీడీపీలోకి చేరగా వారికి రాజప్ప పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. కట్టమూరు, దివిలి, చంద్రమాపంల్లి, తాటిపర్తి గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఆరిఫ్ ఆలీ, తూతిక రాజు, కొరిపూరి రాజు కందుల విశ్వేశ్వరరావు, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్టీరాజాపురంలో...

గండేపల్లి, మార్చి 13: వైసీపీ ప్రజావ్యతిరేక పాలనను తొందరలో ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలో ఎన్టీరాజాపురంలో గండేపల్లి జడ్పీటీసీ పరిమి వెంకటలక్ష్మిమంగతాయారు సుమారు 800మంది అనుచరులతో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నెహ్రూ మాట్లాడుతూ టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. రాష్ట్ర కార్యదర్శులు కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, యువనాయకులు జాస్తి వసంత్, వైస్ ఎంపీపీ కుంచే రాజా, కందుల చిట్టిబాబు పాల్గొన్నారు.

రాజపూడిలో...

జగ్గంపేట, మార్చి 13: రాజపూడిలో వైసీపీకి చెందిన కందుల విశ్వేశ్వర రాంబాబు పట్నాల రామకృష్ణ ఆధ్వర్యంలో కందుల దొరప్రసాద్, కందుల జగ్గారావు, చిట్టాది పట్టాభిరామారావు, పట్నాల నాని, మాది నీడి రామకృష్ణ, కునిశెట్టి సుబ్బారావు, గోపిసీడి పెద్ద అబ్బు సుమారు 50కుటుంబాలు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరగా పార్టీ కండువాలతో స్వాగతించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఉప్పలపాటి బుల్లబులు, రేఖబుల్లిరాజు, గద్దే కృష్ణ, కందుల సత్యనారాయణ, తాండ్రంగి అచ్చారావు, గనిశెట్టి సన్యాసిరావు, ముమ్మ దుర్గ, నంగన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తలు అపోహలు వీడండి'

తొండంగి, మార్చి 13: తాను టీడీపీని వీడి వేరే పార్టీలో చేరుతున్నానంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని, కార్యకర్తలు దీనిని గమనించాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు స్పష్టం చేశారు. బుధవారం ఆయన పిఇ.చిన్నయ్యపాలెం వేదికగా తనపై జరుగుతున్న ప్రచారాన్ని కొట్టి పారేశారు. తనకు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడికి మధ్యవిబేదాల కారణంగా తాను వైసీపీలో చేరుతున్నానని చెప్పి కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని దీనిలో వాస్తవం లేదన్నారు. 40 ఏళ్లుగా తమ పయనం కొనసాగుతోందని, చిన్న చిన్న అపోహలు వచ్చినా వాటిని తామిద్దరం అర్థం చేసుకుని సర్దుకు పోవడం అలవాటేనన్నారు. అపోహలు వీడి కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి యనమల దివ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

'పైప్‌లైన్‌ను తొలగించాలి'

కొత్తపల్లి, మార్చి 13: సెజ్‌లో ఏర్పాటు చేసిన లైఫిజ్ ఫార్మాకంపెనీ నుంచి వెలువడే వ్యర్థాలను సముద్రంలోకి విడుదల చేసేందుకు ఏర్పాటుచేసిన పైప్‌లైన్‌ను తొలగించాలని మండలంలో పొన్నాడ శివారు కోనపాపపేటలో తుని-కాకినాడ ప్రధాన రహదారిపై బుధవార మత్స్యకారులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. కోనపాపపేట గ్రామం ప్రారంభం నుంచి తుని వైపు వెళ్లే అన్ని రోడ్లను మత్స్యకారులు సిమ్మెంటు బల్లలు, కరెంటు స్తంబాలు, తాటిచెట్లతోను ఎక్కడికక్కడ మూసివేశారు. ప్రభుత్వ పాఠశాలను మూయించివేసి నిరసన తెలిపారు. నడిరోడ్డుపై మత్స్యకార కుటుంబాలన్నీ వారంరోజులుగా ఆందోళన చేస్తుండగా ఫార్మా కంపెనీ తమ పనిచేసుకుంటూ పోతుందని ఆవేదన చెందారు. గత 23 నెలలుగా ఉపాధి లేకుండా న్యాయం కోసం పోరాటం చేస్తున్న మత్స్యకారుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

'ప్రకృతి వ్యవసాయంతో లాభం'

ప్రత్తిపాడు, మార్చి 13: ప్రకృతి వ్యవసాయం లాభసాటితో పాటు ఆరోగ్యదాయకమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎలియాజర్ తెలిపారు. మండలంలోని ఒమ్మంగి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తుల ప్రదర్శన బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన మేనేజర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగులో గోమూత్రం, సేంద్రీయ ఎరువుల వినియోగం వల్ల వ్యవసాయ దిగుబడులు కలుషితం కావడం లేదన్నారు. దీని వల్ల ప్రజారోగ్యానికి ఈ ఉత్పత్తులు ఎంతో దోహదపడి ప్రజల్లో ఎంతో ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వై.వెంకట్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చిట్లూరి లోవకుమారి, వీఓఏలు నూకరత్నం, గంగాభవాని, నాగమణి, ప్రకృతి వ్యసాయ సిబ్బంది జిల్లా కోఆర్డినేటర్ వైఎం.గణేష్, మండల కమిటీ ట్రైనర్లు మూరా చినబాబు, ఎం.రామరాజు ఉన్నారు.

'పనిదినాలను పూర్తి చేయాలి'

కరప, మార్చి 13: ఈ ఆర్థిక సంవత్సరాంతానికి నిర్దేశిత పనిదినాలను నూరుశాతం పూర్తిచేయాలని ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్ సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో బుధవారం ఉపాధిహామీ పథకం సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బందితో ఆయన సమావేశమై చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 3,21,820 పనిదినాలు కల్పించాల్సి ఉండగా ఇంతవరకు 3,02,340 పనిదినాలు పూర్తిచేయగలిగామని, ఈ నెలాఖరు నాటికి మిగిలిన పనిదినాలను పూర్తిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఏప్రిల్ నుంచి కొత్త పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. టీఏలు కేజే ప్రకాష్, టి.రాజేంద్ర ఉన్నారు.

'నా అభ్యర్థనను పరిశీలించాలి'

కాకినాడ సిటీ, మార్చి 13: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వైద్యశిబిరాల ద్వారా ప్రజలకు చేరువలో ఉంటూ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన తన అభ్యర్థనను రామచంద్రపురం నియోజకవర్గానికి పరిశీలించాలని టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడును కలిసి విన్నవించుకున్నారు.

27న పింఛను అదాలత్

కాకినాడ సిటీ, మార్చి 13: కాకినాడ పోస్టల్ డివిజన్ పరిధిలోని పింఛనుదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించే నిమిత్తం ఈనెల 27న సాయంత్రం 5 గంటలకు కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో పింఛను అదాలత్ నిర్వహిస్తున్నట్టు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. పింఛను సర్వీసులకు సంబంధించిన ఫిర్యాదులు, సలహాలను మాత్రమే చర్చిస్తామన్నారు. ఆయా సమస్యలు, ఫిర్యాదులను ఈ నెల 22 లోపు పింఛను అదాలత్ అనే శీర్షికతో కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ వారి కార్యాలయం కాకినాడ-533001 చిరునామాకు పంపాలని కోరారు. ఫిర్యాదుదారులు వ్యక్తిగతంగా కూడా అదాలత్‌కు హాజరుకావచ్చని ఒకప్రకటనలో తెలిపారు.

కౌలురైతుల ధర్నా

తాళ్లరేవు, మార్చి 13: ప్రభుత్వం కౌలురైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కౌలురైతు జిల్లాసంఘం ఆధ్వర్యంలో పలువురు తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందుల సబ్సిడీలు పెంచి తక్కువ ధరకే పురుగులు మందులు సరఫరా చేయాలని కోరారు.

టీడీపీ-జనసేన కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

కోకోర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్

సర్పవరం జంక్షన్, మార్చి 13: టీడీపీ-జనసేన కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, కాకినాడ రూరల్లో పార్టీ బలపరిచిన జనసేన అభ్యర్థి పంతం నానాజీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని నియోజకవర్గ కోకోర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) కోరారు. కాకినాడ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం అసంతృప్తితో ఉన్న కాకినాడ రూరల్, కరప మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ రాక్షసపాలన అంతం కోసం విభేదాలను పక్కన పెట్టి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, యువత కోసం ప్రజల ఆకాంక్షల మేరకు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేన,బీజేపీలతో పొత్తు పెట్టుకవడం జరిగిందన్నారు. పార్టీ కష్టకాలంలో కష్టించి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పార్టీ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా అసంతృప్తితో ఉన్న పార్టీ నాయకులు రాందేవు సీతయ్యదొర, దేవు వెంకన్న, మాజీ జడ్పీటీసీ నులకుర్తి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొల్లాబత్తుల అప్పారావు, పాత్రి రాంబాబు, కొజునెహ్రూ, కర్రి శ్రీను, బచ్చల కామేష్, కొండా వినాయక్ తదితర నాయకులతో మాట్లాడి పార్టీ కోసం కృషి చేయాలని కోరారు. కో కోర్డినేటర్‌గా విచ్చేసిన కటకంశెట్టి బాబీని పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు. సుమారు 200 మంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

డీఈవో రమేష్



కిర్లంపూడి: వీరవరంలో మాట్లాడుతున్న డీఈవో

కిర్లంపూడి, మార్చి 13: పదోతరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలను ఆత్మవిశ్వాసంతో రాయాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ సూచించారు. మండలంలో వీరవరం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. రాబోయే 3,4 నాలుగు రోజుల్లో ప్రైమ్ మినిస్టర్ ఎక్సలెన్స్ అవార్డులకు సంబంధించి తనిఖీ నిమిత్తం కేంద్ర బృందాలు పాఠశాలలను తనిఖీ చేస్తాయన్నారు. పాఠశాలలో ఉన్న ఐఎఫ్‌సీ ప్యానల్స్, బైజూస్ టాబ్స్, స్మార్ట్ టీవీల వినియోగంపై పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎంత వరకు అవగాహన ఉందో అడిగి తెలుసుకున్నారు. 9వతరగతి విద్యార్థులు బైజూస్ టాబ్స్ పరిశీలించి వాటిని సక్రమంగా వినియోగించాలన్నారు. అన్ని తరగతులు పరిశీలించి మధ్యాహ్న భోజన పథకం అమలుపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.దుర్గాప్రసాద్ ఉన్నారు.

సామర్లకోటలో తనిఖీ

సామర్లకోట, మార్చి 13: ప్రభుత్వ పాఠశాలల్లో పదవతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడంతోనే సరిపెట్టకుండా ఉత్తీర్ణతలో క్వాలిటీకి కూడా ప్రాధాన్యత ఉండాలని ఉపాధ్యాయులకు డీఈవో పి.రమేష్ సూచించారు. సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల మేదస్సును హెచ్‌ఎమ్ తోటకూర సాయి రామకృష్ణతో పరీక్షించారు. ఎంఈవో-2 పి.పుల్లయ్య ఉన్నారు.

'స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ట భద్రత కల్పించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 13: ఎన్నికల సామాగ్రిని భద్రపరిచే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ట భద్రత కల్పించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి మెక్లారిన్ స్కూల్ ఆవరణలోని డిస్ట్రిబూటర్ కేంద్రం, జేఎన్టీయూకేలోని స్ట్రాంగ్‌రూమ్‌లను సందర్శించారు. ఎన్నికల కమిషనర్ నిబంధనల ప్రకారం ఆయా కేంద్రాల్లో పూర్తి భద్రత ఉందో లేదో పరిశీలించారు. చిన్నచిన్న సమస్యలు, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరాలు ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న సంబంధిత అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఏఈ రమేష్, తహసీల్దార్ దొర, డిప్యూటీ తహసీల్దార్లు సీతాపతిరావు, నాయుడు, పవన్, సర్వేయర్ ఆచార్యులు తదితరులున్నారు.

'విధులు నిర్వహించాలి'

ప్రత్తిపాడు, మార్చి 13: రాబోయే సార్వత్రిక ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ రూరల్ అధికారులతో ఆయన మాట్లాడుతూ రూట్ అధికారులు, ఫ్లైయిన్ స్క్వాడ్‌లు, ఎస్‌సీసీ, ఎస్ఎస్ఎల్ బృందాలు ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. తహశీల్దార్ నరసింహారావు, ఎలక్షన్ డీటీ శ్రీనివాసరావు ఉన్నారు.

'ఆదేశాలను పాటించాలి'

పెద్దాపురం, మార్చి 13: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)పై రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత ఎన్నికలకు రాజకీయ ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎంపీడీవో ఉషారాణీ, జడ్పీటీసీ గవరసాన సూరిబాబు, పొలమరశెట్టి సత్తిబాబు, దారపురెడ్డి క్రాంతికుమార్ ఉన్నారు.

టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక

జగ్గంపేట రూరల్, మార్చి 13: టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో మండల గ్రామాల్లో ఆత్మీయ కలయిక సమావేశాన్ని జగ్గంపేట టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ నిర్వహించారు. జనసేన నేతలతో కలిసి కార్యకర్తల ఇంటికి వెళ్లి వారితో ముచ్చటించారు. ఇరు పార్టీల అధ్యక్షులు కలిసి తీసుకున్న నిర్ణయాన్ని మనమందరం స్వాగతించాలని ఇది రాష్ట్ర ప్రయోజనాల కోసం వారు తీసుకున్న నిర్ణయమన్నారు. ఏమైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే త్వరలోనే అన్ని సర్దుకుంటాయని అందుకు అందరూ సమష్టిగా కృషి చేద్దామన్నారు. బీజేపీ నేత దాట్ల కృష్ణవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీలు కలవడం శుభపరిణామని ఇది రాష్ట్ర భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని కాండ్రేగుల, మామిడాడ, పట్నం, భావారం, గుర్రపాలెం, గొల్లలగుంట, రామవరం, సగరపేట తదితర గ్రామాల్లో జనసేన నేతలతో కలిసి నెహ్రూ పర్యటించారు. కార్యక్రమాల్లో ఎస్‌వీఎస్ అప్పలరాజు, బుదిరెడ్డి శ్రీనివాస్, పాలిశెట్టి సతీష్, మారిశెట్టి భద్రం, బుర్రి సత్తిబాబు, జనసేన నేతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్‌పై ఫిర్యాదు

కాజులూరు, మార్చి 13: మండలంలో ఆర్యవటం ముత్తావారి గరువు ప్రాంతానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ చిన్నారిని దారుణంగా కొట్టిందంటూ స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్న శ్రీజ 2రోజుల క్రితం నాలుగేళ్ల చిన్నారి నీలవేణి వీపుపై గట్టిగా కొట్టడంతో ఎరుపు రంగు మచ్చలు పడినట్టు చిన్నారి తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. బుధవారం అంగన్‌వాడీ ఆయాను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చిందని మండిపడ్డారు. గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసి చిన్నారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంగన్‌వాడీ సూపర్వైజర్లు రమణి, కనకరత్నం అంగన్‌వాడీ వద్ద వివరాలు చేపట్టారు.

టీడీపీ శాలివాహన సాధికార సమితి కన్వీనర్‌గా సత్యనారాయణ

సర్పవరం జంక్షన్, మార్చి 13: టీడీపీ కాకినాడ పార్లమెంటరీ శాలివాహన సాధికార సమితి కన్వీనర్‌గా కాకినాడ రూరల్ పెనుమర్తికి చెందిన సీనియర్ నేత భీమాబత్తుల సత్యనారాయణ నియమితులయ్యారు. మంగళవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుల ఆదేశాల మేరకు రాష్ట్ర కుమ్మర,శాలివాహన సాధికార సమితి అధ్యక్షుడు మదనాపు పోతలయ్య పార్లమెంటరీ కమిటీని ప్రకటించారు. పార్లమెంటరీ కన్వీనర్‌గా భీమాబత్తుల సత్యనారాయణతోపాటు పార్లమెంట్ సభ్యులుగా దేవవరు నూకరాజు(కాకినాడ), టిల్లపూడి సత్తిబాబు, కోటిపల్లి శ్రీనివాస్ (కాకినాడ రూరల్), కేసనకుర్తి వీరబాబు, దాలిపర్తి రాజు (పెద్దాపురం), అమలాపురం దుర్గాప్రసాద్, పొట్నూరి సత్యబాబు (జగ్గంపేట), లీలాకుమార్, కాదులూరి దేవదాస్ (ప్రత్తిపాడు), కోసూరి రామారావు, జగ్గుపాటి త్రిమూర్తులు (పిఠాపురం), చేబ్రోలు నానాజీ, అమలాపురం సత్యనారాయణ (తుని), పోలవరం వెంకటేష్‌ను నియమించినట్టు పార్లమెంటరీ కన్వీనర్ తెలిపారు.

'ఆదాయం పెంచే దిశగా కృషి'

పెద్దాపురం, మార్చి 13: మున్సిపాల్టీకి ఆదాయ వనరులను పెంచే దిశగా అధికారులు కృషి చేయాలని ఆర్డీ సత్యనారాయణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఇంటి, ఖాళీ స్థలాలు పన్నుల వసూళ్లపై చర్చించారు. ప్రభుత్వం జీవో నంబర్ 35 ద్వారా పన్నులపై వడ్డీ రాయితీ ఇచ్చిందన్నారు. పన్ను బకాయిలు లేకుండా, వడ్డీ రాయితీని వినియోగించుకునేలా చూడాలన్నారు. కమిషనర్ కేవీ పద్మావతి, ఆర్వో చంద్రశేఖర్, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, సచివాల అడ్మిన్స్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ఏలేశ్వరం, మార్చి 13: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో రక్తదాతలు ముదుండాలని ప్రభుత్వాసుపత్రి సూపర్‌వైజర్ శైలజ అన్నారు. నేషనల్ ల్యాబ్ టెక్నీషన్ డే పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 36మంది యువకులు రక్తదానం చేశారు. వై.రవి, మధు, త్రిమూర్తులు, తేజ తదితరులున్నారు.

పరీక్ష అట్టల పంపిణీ

తుని రూరల్, మార్చి 13: తుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్.అన్నవరం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు కేఎస్‌ఎల్‌ఎస్.వర్మ, సెక్రటరీ కె.కిషోర్‌రెడ్డి, కె.ఈశ్వర్ గణేష్, జి.బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

రౌతులపూడి, మార్చి 13: సోషల్ ఆడిట్‌పై మండలంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో కార్యాలయం నందు ట్రైనర్ కే.వెంకటేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. అబ్జర్వర్‌గా సీఎంవో ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, ఎంఈవో సీహెచ్ శ్రీని వాసరావు, ఎంఐఎస్ కోళ్ల ఎరకయ్యనాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ చింతకాయల నానాజీ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వర్ధంతి

రౌతులపూడి, మార్చి 13: టీడీపీకి దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే పర్వత చిట్టిబాబు చేసిన సేవలు మరవలేనివని మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు అన్నారు. ఆయన నివాసంలో చిట్టిబాబు 8వ వర్ధంతిని నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేతలు గంటా గోపి, అల్లు బుజ్జి, పసగడుగుల రమణ పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన పెండెం

కిర్లంపూడి, మార్చి 13: పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు బుధవారం కిర్లంపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభాన్ని ఆయన గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.